సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



సమ్మెటివ్ పోయి సాంప్ వచ్చె

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు జరగనున్నాయి. 19 వరకు పరీక్షలు జరుగుతాయి. -10లో



అనుమానాస్పద మృతి

నరసన్నపేటలో ఓ వివాహిత అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. -10లో

నేడు, రేపు విద్యుత్ కోత

కాశీబుగ్గ: గరివిడి-టెక్కలి సర్కిల్ నందు 220/132/33 కేవీ లైన్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం, గురువారం పలాస, టెక్కలి డివిజన్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు పలాస ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదని అందరూ సహకరించాలని కోరారు.



బ్యాటింగ్ చేస్తున్న ప్రసాద్

ఆడితే.. ఆడాలిలా..

- అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన సింగుపురం దుర్గ నాగ వరప్రసాద్ అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ఎంపికయ్యాడు. 2024-25 సీజన్‌కుగాను త్వరలో బీసీసీఐ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్‌రాష్ట్ర అండర్-23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. తాజాగా జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ-20 క్రికెట్ టోర్నీలోనూ ఆంధ్రా తరఫున ఆడాడు. చక్కటి ఆటతీరు కనబరచడంతో అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీలో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నాడు.

తృటిలో ఐపీఎల్ మిస్



ఆంధ్రా జట్టు తరుపున రాణిస్తున్న ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్‌కు ఐపీఎల్ కింగ్స్ లెవన్ పంజాబ్ నుంచి సెలక్షన్ ట్రయల్స్‌కు పాల్గొన్నప్పటికీ వేలంలో పేరును పరిగణనలోకి రాకపోవడంతో తృటిలో అవకాశాన్ని కోల్పోయాడు. వచ్చే 2026 ఐపీఎల్ టార్గెట్‌గా ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నాడు. జలుమూరుకు చెందిన ఈ సిక్కోలు కుర్రాడు వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ కావడం.. మెరుగ్గా రాణిస్తుండటంతో అవకాశాలను దక్కించుకున్నాడు.

తండ్రి లేకున్నా..

జలుమూరులోని పోలీస్‌స్టేషన్ వీధిలో నివాసం ఉండే ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్ తండ్రి సింగుపురం ఉపేంద్ర కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ 2019లో అనారోగ్యంతో మరణించారు. తల్లి సింగుపురం రేవతి జలుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థి టెక్కలిలో ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్‌కు ఎంపికకావడమే తన ముందున్న లక్ష్యమని ప్రసాద్ చెబుతున్నాడు.

● దైవ సందేశం



క్రిస్మస్ ముందస్తు వేడుకలు అంతటా ఆరంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం రోడ్డులో ఉన్న ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో ఎలోహిమ్ గాస్పెల్, ప్రేయర్ టీమ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. దైవసందేశాన్ని రెవ.మేజస్ ఇవ్వగా, పాస్టర్ ఎస్ సురేష్ ఐజాక్ కార్యక్రమం నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

● తనిఖీలు ముమ్మరం

గంజాయి రవాణా కట్టడి చేసేందుకు ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సీఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్ శిక్షణ పొందిన రాణి అనే జాగిలంతో వాహనాలు, దుకాణాలను తనిఖీ చేయించారు. ప్రధానంగా ఒడిశా నుంచి గంజాయి రవాణా అవుతుండటంతో ఎస్పీ ఆదేశాల మేరకు బలద, కడుము, కడుము కాలనీ, కొశల్యాపురం తదితర సరిహద్దు గ్రామాల్లో అణువణువూ గాలించారు. కొత్తూరులోని కిరాణా షాపుల్లో సైతం తనిఖీలు చేపట్టారు.

– కొత్తూరు



● అమ్మకు బంగారు కిరీటం



జిల్లా కేంద్రంలోని ఫాజుల్‌బాగ్ పేటలో వేంచేసిన భద్రమహంకాళి అమ్మవారికి పలువురు భక్తులు బంగారు కిరీటం, బంగారు కర్ణాభరణాలను సమర్పించారు. బంగారు కిరీటాన్ని ఎస్‌ఆర్‌ఐ భక్తులు భద్రరావు దంపతులు సమర్పించగా, బంగారు కర్ణాభరణాలను పలువురు భక్తుల సహకారంతో సమర్పించారు. అలాగే కిల్లంశెట్టి అరుణకుమార్ దంపతులు ఇత్తడి గణపతి విగ్రహాన్ని, సాతివిల్లి చంద్రమౌళి దంపతులు ఇత్తడి సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆభరణాలు చేసిన శిల్పిని సత్కరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

పేదల పాకలపై దాష్టీకం

- టీడీపీ నేతల కక్షపూరిత రాజకీయం
- 70 ఏళ్లుగా పేదలు ఉంటున్న పాకల తొలగింపు
- బోరుమంటున్న భైరివానిపేట గ్రామస్తులు



జేసీబీతో గుడిసెను తొలగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని భైరివానిపేటలో టీడీపీ నేతలు కక్షపూరిత రాజకీయాలకు తెర లేపారు. ఈ గ్రామంలో సర్వే నంబర్ 83లో 1, 2, 3, 4 సబ్ డివిజన్‌లో గల చెరువు గర్భం 50సెంట్లతో పాటు సర్వే నంబర్ 44లోని గోర్జిలో 10సెంట్లు విస్తీర్ణం గల ప్రభుత్వ స్థలంలో కొందరు 70 ఏళ్లుగా పాకలు, గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వీరిలో చాలా మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు. దీంతో స్థానిక సర్పంచ్‌తో పాటు టీడీపీ నేతలు కక్ష కట్టారు. అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి పది కుటుంబాలకు చెందిన గుడిసెలను మంగళవారం కూలదోయించారు. దీంతో పేదలు లబోదిబోమన్నారు.



పెంచుకున్న చెట్లను తొలగిస్తున్న దృశ్యం

కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు



గ్రామానికి చెందిన టీడీపీ సర్పంచ్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులుగా ఉన్న మా నివాసాలను తొలగించారు. 50 ఏళ్లుగా ఉంటున్న మా నివాసంలో నా ఇంటి ప్రహరీని తొలగించారు.

– సిమ్మ అప్పన్న, వైఎస్సార్ సీపీ నాయకుడు

బతిమలాడినా కనికరించలేదు



నా వయస్సు 80 ఏళ్లు. నా పిల్లలు, నా మనవళ్లు అందరూ ఇదే ఇంటిలో పుట్టి పెరిగారు. గ్రామంలో రాకపోకలకు నా ఇల్లు అడ్డుగా లేదు. కానీ ఇప్పుడు పాకలను తొలగించేశారు. ఎంత బతిమలాడినా వినలేదు.

– కర్రి పాపయ్య, గ్రామస్తుడు

సర్పంచే చేశారు



టీడీపీ సర్పంచ్ అధికారులను ఉసిగొల్పి మా పాకలు తీయించేశారు. ఆయన గతంలో చెరువు గట్టు మీద గల తుమ్మచెట్టు, చీమ ఖర్జూరం చెట్లను గ్రామస్తులకు తెలీకుండా అమ్ముకున్నారు.

– బొగ్గు అప్పన్న, గ్రామస్తుడు

నోటీసులు ఇచ్చాం

స్థానికంగా నివాసం ఉంటున్న వారంతా ప్రభుత్వ గోర్జితో పాటు చెరువు గర్భంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు మాకు నివేదిక ఇచ్చారు. దీంతో మేము 17 మందికి నోటీసులను మూడు దఫాలుగా అందించాం.ఎవ్వరూ స్పందించలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించాం.

– బొడ్డేపల్లి శైలజ, ఎంపీడీఓ



ఈ రైతు పేరు బొమ్మాళి శిమ్మన్న. కృష్ణాపురం గ్రామం, ఎల్ఎన్ పేట మండలం. ఈ ఏడాది ఖరీఫ్ వరి పంట పండించిన ఈయన దళారులకు విక్రయించాలని వారిని సంప్రదించగా మూడు కిలోలు అదనంగా అడిగారు. తన ధాన్యం తానే నేరుగా మిల్లరు వద్దకు తీసుకుని వెళ్లాడు. మిల్లరు రెండు కిలోలు అదనంగా అడిగాడు. అప్పటికే తనకు తెలిసిన ఓ వ్యక్తి మిల్లు వద్దకు రావటంతో ఆయనతో చెప్పించగా మిల్లరు కిలోన్నర అదనంగా తీసుకుని ధాన్యం కొనుగోలు చేశారని శిమ్మన్న ఆవేదన వ్యక్తం చేశారు.



అన్నదాతపై అదనపు భారం



ఓ రైస్ మిల్లులో ఉన్న ధాన్యం బస్తాలు

అదనంగా అడిగితే సహించేది లేదు



ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడైనా రైతుల నుంచి అదనంగా ధాన్యం అడిగితే సహించేది లేదు. అలాంటి సంఘటనలు ఎక్కడైనా ఉంటే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయంలో ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలతో హెచ్చరికలు జారీ చేశాం.

– ఎం.కృష్ణమూర్తి, ఆర్డీఓ, టెక్కలి

- పంటను అమ్మాలంటే కోటి కష్టాలు
- బస్తాకు అదనంగా 3కిలోల తూకం
- తేమ, పొల్లు గింజలు, మట్టి, రాళ్లు ఉన్నాయంటూ సాకు
- రైతన్నను దోపిడీ చేస్తున్న మిల్లర్లు, దళారులు
- మిల్లర్ల సేవలోనే అధికార యంత్రాంగం

జిల్లాలో పరిస్థితి

జిల్లాలో ఖరీఫ్ వరిసాగు విస్తీర్ణం	ధాన్యం దిగుబడి అంచనా	కొనుగోలు లక్ష్యం	జిల్లాలో రైతుల సంఖ్య	ధాన్యం కొనుగోలు కేంద్రాలు	జిల్లాలో రైస్ మిల్లులు
3,59,985 ఎకరాలు	8.62 లక్షల మెట్రిక్ టన్నులు	4.90 లక్షల మెట్రిక్ టన్నులు	2,94,175 మంది	402	260

ఎల్.ఎన్.పేట: ఆరుగాలం కష్టించి పండించిన పంటను విక్రయించేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా తెరవటంతో రైతులు మిల్లర్లు, దళారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే నాటికే ధాన్యం కొనుగోలు ప్రక్రియను మిల్లర్లు, దళారులు ప్రారంభించి రైతుల నుంచి దోపిడీకి తెరలేపారు. సాధారణంగా రైతు నుంచి బస్తాకు 80 కిలోలు చొప్పున ధాన్యం కొనుగోలు చేస్తారు. 80కిలోల ధాన్యంకు లెక్క కట్టి డబ్బులు చెల్లిస్తారు. అయితే 80కిలోలకు అదనంగా రెండు నుంచి మూడు కిలోల ధాన్యం తీసుకుంటున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనంగా ధాన్యం ఇవ్వకపోతే రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసేది లేదని దళారులు, మిల్లర్లు మొండికేయటంతో ఏం చేయాలో తెలియని దుస్థితిలో రైతులు వారు అడిగినంత అదనంగా చెల్లించుకుంటున్నారు.

తేమ, పొల్లు గింజలంటూ..

రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో బస్తాకు అదనంగా రెండు నుంచి మూడు కిలోల ధాన్యం ఎక్కువ తూకం వేస్తున్నారు. అలా ఎందుకు ఇవ్వాలని రైతులు ప్రశ్నించినా, ఇవ్వమని చెప్పినా మీ ధాన్యంలో తేమ శాతంతో పాటు పొల్లు గింజలు, మట్టి, ఇతర వ్యర్థాలు ఉన్నందున కొనుగోలు చేయలేమని దళారులు, మిల్లర్లు రైతు వద్దనే ధాన్యం విడిచిపెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో చేసేది లేక రైతులు అదనంగా చెల్లిస్తున్నారు. రైతులను దోపిడీ చేస్తున్న దళారులు, మిల్లర్లను కట్టడి చేయలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగిపోతుందని లెక్కలు చూపిస్తు మిల్లర్ల సేవలో అధికారులు తరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మద్దతు ధర ఇలా..

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం సాధారణ రకం (కామన్) 80 కిలోల బస్తా రూ.1840, గ్రేడ్-ఎ రకం ధాన్యం 80 కిలోల బస్తా రూ.1856లకు కొనుగోలు చేయాల్సి ఉంది. కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు తప్పని దోపిడీ



పండించిన పంటను అమ్ముకోవడానికి దళారులు, మిల్లర్ల చేతిలో దోపిడీకి గురవుతున్నాం. ఈ ఏడాది పంట దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. పండించిన ధాన్యం అమ్ముకోవాలంటే దళారులు, మిల్లర్ల చేతిలో దోపిడీకి గురికావాల్సి వస్తోంది. అదనంగా రెండు నుంచి మూడు కిలోల ధాన్యం తీసుకుంటున్నారు.

– బొడ్డేపల్లి రాజరత్నం, రైతు, తురకపేట

అదనంగా ధాన్యం అడుగుతున్నారు



ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లదే రాజ్యంగా ఉంది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సరైన మార్గంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక్కో బస్తాకు అదనంగా 2 నుంచి 3 కేజీల ధాన్యం అడుగుతున్నారు.

– ఆర్.వెంకటరమణ, రైతు, తేలినీలాపురం, టెక్కలి మండలం

తీగ లాగుతున్నారు



ఆర్మీకాలింగ్‌సెంటర్ వద్ద ఒకటో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఎల్‌బీఎస్ నగర్‌లోని ఆర్మీ కాలింగ్ సెంటర్‌కు ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం వెళ్లారు. గొడవ జరుగుతుందని తమకు సమాచారం రావడంతో ఎస్పీ ఆదేశాలతో వెళ్లినట్లు ఎస్ఐ ఎం.హరికృష్ణ చెప్పారు. తమ వద్ద ఉన్న పెన్‌డ్రైవ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పోలీసులు అడగడంతో ఇచ్చామని అక్కడి విద్యార్థులు పేర్కొన్నారు. డేటా భద్రంగా ఉంచాలని, నేరుగా ఎస్పీకే అందజేయాలని విద్యార్థులు కోరినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ సంస్థలో రూ.లక్షలు కట్టించుకుని ఉద్యోగాలు ఇవ్వలేదని అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు ప్రస్తావించారు. రమణ ల్యాప్‌టాప్‌లు, పెన్‌డ్రైవ్‌లు పరిశీలిస్తే అమ్మాయిలకు సంబంధించి వేధింపుల పర్వం బండారం బయటపడుతుందన్నారు. పోలీసులు, కొంతమంది మీడియా ప్రతినిధులు, ప్రముఖుల అండదండలు రమణకు మొదటి నుంచీ ఉండటంతో తాము డైరెక్టుగా కోర్టులోనే వీడియోలు, ఆధారాలు సబ్మిట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని బాధితులు చెప్పడం విశేషం. మంగళవారం కూడా రమణ మోసాలపై రూరల్ పోలీస్ స్టేషన్‌లోను, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి.

కాలింగ్ సెంటర్ అకృత్యాలపై..

మంగళవారం జిల్లాకు విచ్చేసిన రెండు రాష్ట్రాల ఆర్మీ డిప్యూటీ జనరల్ కమాండింగ్ అధికారి బ్రిగేడియర్ ఎస్‌వీ నంజుదేశ్వర్ పలాస, శ్రీకాకుళం క్యాంటీన్లను సందర్శించారు. అనంతరం జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారిణిని ఆర్మీకాలింగ్ సెంటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన సెంటర్ ఆగడాలపై ఆమె నివేదిక ఇచ్చారు. ఈ సెంటర్‌లో పనిచేసి మానేసిన విజయనగరానికి చెందిన కీలక వ్యక్తిపై ఇప్పటికే అక్కడి మాజీ సైనిక సంఘం వివరాలు సేకరించే పనిలో పడ్డారని సమాచారం.

కౌశల్ ప్రతిభా పరీక్షలో సొండిపూడిదే ప్రథమ స్థానం



మాధవి, భాగ్యలక్ష్మిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

కాశీబుగ్గ: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6వ తేదీన నిర్వహించిన కౌశల్ ప్రతిభా పరీక్ష ఫలితాలను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మందస మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రథమ స్థానం దక్కించుకుంది. పదోతరగతి చదువుతున్న డొక్కరి మాధవి రీల్స్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించగా అదే తరగతికి చెందిన భాగ్యలక్ష్మి పాణిగ్రాహి క్విజ్‌పోటీల్లో ద్వితీయ స్థానం సంపాదించుకుంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డిప్యూటీ డీఈఓ పి.విలియమ్స్‌లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు హెచ్‌ఎం సుందర్ సాల్మన్ ఆధ్వర్యంలో అభినందించారు.

రైతుల సమస్యలపై పోరాటం



పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ నాయకులు

- 13న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రైతులను అన్ని రకాలు గా ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరుమాసాలైనా ఒక్క రూపాయి అందించకపోవడంపై రైతులు మండిపడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇప్పటివరకు ఒక్క విడత కూడా రైతుభరోసా (అన్నదాత సుఖీభవ) డబ్బులు జమ చేయకపోవడం దారుణమన్నారు. రైతుల సమస్యలను ఎత్తి చూపేందుకు జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావుపూలే పార్కు (పొన్నాడ వంతెన) వద్ద ఈ నెల 13న ర్యాలీ, నిరసన కార్యక్రమం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నామని కృష్ణదాస్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ సన్మాన సభలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ 27న విద్యుత్ చార్జీలపై, 3న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆందోళన చేస్తామన్నారు.ధాన్యం కొనుగోలులో దళారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా కనీసం కూటమి ప్రభుత్వం చర్య లు తీసుకోకపోవడం దారుణమన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, దుంపల లక్ష్మణరావు, పిన్నింటి సాయి, అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు 4వ సారి షెడ్యూల్

ఎల్ఎన్ పేట: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు బుధవారం నాలుగోసారి షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారు. తాజాగా విడుదల కానున్న 'ఫారం-3ఎ' షెడ్యూల్ ప్రకారం ఈనెల 14వ తేదీన సాగునీటి సంఘాలకు సంబంధించిన బహిరంగ ప్రకటనను అధికారులు చేస్తారు. ఈనెల 14వ తేదీ ఉదయం 8గంటల నుంచి టీసీ సభ్యుల (నీటి సంఘాల ప్రాదేశిక సభ్యుల) ఎన్నిక ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఏకాభిప్రాయం, ఏకాభిప్రాయం లేనప్పుడు అనే రెండు పద్ధతుల ద్వారా ఎన్నికలను నిర్వహిస్తారు. జిల్లాలో 344 మేజర్, మైనర్ సాగునీటి సంఘాలుగా విభజించారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిధిలో 54 సంఘాలు, కుడి ప్రధాన కాలువపై 18 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇరిగేషన్ శాఖ పరిధిలో 250 మైనర్, మరో 21 మేజర్ సాగునీటి సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు జరగన్నాయి. వీటిలో 2,11,429 మంది రైతులను ఓటర్లుగా గుర్తించారు. మేజర్ సాగునీటి సంఘాలకు 12 మంది టీసీ సభ్యులు, మైనర్ సాగునీటి సంఘాలకు ఆరుగురు టీసీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. టీసీ సభ్యులు సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. మేజర్ సాగునీటి సంఘాల్లో మొదటి ఆరు టీసీలు, కింద నుంచి ఆరు టీసీల్లో ఎవరో ఒకరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

15న జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ బాలురు, బాలికల జట్ల ఎంపికలు ఈనెల 15వ తేదీన జరగనున్నాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ శ్రీకాకుళం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్ష,కార్యదర్శులు నక్క కృష్ణారావు, సాదు ముసలినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మొదలవుతాయని చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు బరువు ఉండాలని వారు స్పష్టంచేశారు. మరి న్ని వివరాలకు పీడీ సాదు శ్రీనివాస్ (9441914214)ను సంప్రదించాలన్నారు.

● నారికేళ ద్వార పాలకులు..



నారికేళ వృక్షాలే ద్వార పాలకులుగా.. పక్షుల కువకువలే సుప్రభాతాలుగా.. తొలి వేకువన మంచు తెరల తలుపులు తెరిచి బాలాదిత్యుడు ఇలా సుందర రూపుడై దర్శనమిచ్చాడు. పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేటుకు సమీపంలో ఈ అద్భుత దృశ్యం మంగళవారం ఆవిష్కృతమైంది.

– కాశీబుగ్గ

సమ్మేటివ్ పోయె.. సాంప్ వచ్చే..!

- సమ్మేటివ్ పరీక్షలు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్(సాంప్)గా మార్పు
- నేటి నుంచి 19వ తేదీ వరకు నిర్వహణ
- తీవ్ర జాప్యం తర్వాత ఎట్టకేలకు స్పందించిన కూటమి ప్రభుత్వం
- ఎంఆర్సీ కేంద్రాలకు చేరిన ప్రశ్నపత్రాలు


పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తరగతుల వారీగా అభ్యసన సామర్థ్యాల మదింపునకు విద్యాశాఖ ఏటా పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రతి విద్యా సంవత్సరంలో నాలుగు ఫార్మేటివ్ (పూర్వపు యూనిట్ టెస్టులు), రెండు సమ్మేటివ్ (పూర్వం క్వార్టర్లీ, అర్ధసంవత్సరం) పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఉన్నతాధికారుల ఉదాశీనత కారణంగా ఈ పరీక్షల నిర్వహణలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు నేటి నుంచి పరీక్షలు మొదలుకానున్నాయి. గతంలో సమ్మేటివ్-1, 2 పేరిట నిర్వహించిన ఈ పరీక్షలకు కూటమి ప్రభుత్వం సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపరు (సాంప్)గా పేరు మార్చింది.

ఇదీ పరిస్థితి..

ఇప్పటి వరకు రెండు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించగా, ఐదు నెలలకు ఒకసారి నిర్వహించే సమ్మేటివ్ మొదటి పరీక్ష అక్టోబర్ మాసాంతం గానీ, నవంబర్ మొదటి వారంలో పరీక్షను నిర్వహించాల్సి ఉంది. సగం విద్యా సంవత్సరం కూడా ముగిసిపోయినా ఇప్పటి వరకూ సమ్మేటివ్ -1 పరీక్ష నిర్వహించలేదు. కనీసం ఈ నెల మొదటి వారంలో నిర్వహించాల్సి ఉండగా అది కూడా సాధ్యంకాలేదు. పరఖ్ సర్వేక్షణ్-2024 సర్వే, మెగా టీచర్స్-పేరెంట్స్ మీటింగ్, ఎన్ఎంఎంఎస్ పరీక్షల కారణాలతో మరింత జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు మోడల్ పేపర్ పరీక్షలు నిర్వహించాలని ఎస్‌సీఈఆర్టీ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు.

క్యూఆర్ కోడ్..

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు క్యూఆర్ కోడ్‌ను కేటాయించింది. పరీక్ష పేపర్లను ఎవరు లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం అధికారులకు తెలిసిపోతుంది. ఈ టెక్నాలజీని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. 2024 మార్చిలో జరిగిన టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల సమయంలో ఈ టెక్నాలజీని వినియోగించి విజయవంతమైన విషయం తెలిసిందే. ఎమ్మార్సీ, స్కూల్ కాంప్లెక్స్‌ల్లో పరీక్షకు గంట ముందు మాత్రమే ప్రశ్నపత్రాలను ఇస్తుండడంతో వాటిని పాఠశాలలకు చేర్చడానికి ఉపాధ్యాయులు హైరానా పడుతున్నారు. ఒకటో తరగతి నుంచి 10 తరగతులకు రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి (ఎస్‌సీఈఆర్టీ) ప్రశ్న పత్రాలను తయారు చేసింది. ఈ పత్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం (డీసీఈబీ) ద్వారా ఎంఆర్సీలకు, అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఉదయం 6, 7, 8 తరగతులకు, మధ్యాహ్నం 9, 10 తరగతులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విధానం మూడు విద్యా సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. తాజాగా 1-10 తరగతుల పరీక్ష పేపర్లు ఎమ్మార్సీల నుంచే తీసుకువెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రం నుంచి మారుమూల గ్రామాలకు ప్రతి రోజూ ప్రశ్నపత్రాలను తీసుకువెళ్లడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ముఖ్యంగా ఎమ్మార్సీలకు దూరంగా ఉండే స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని హెచ్ఎంలు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు.

పాఠశాల	ప్రభుత్వ	ప్రైవేట్
ప్రాథమిక	1955	82
ప్రాథమికోన్నత	269	125
ఉన్నత	414	191
విద్యార్థులు	160151	94741

ప్రశ్నపత్రాలను చేరవేశాం..



సెల్ఫ్ అసెస్‌మెంట్ టెర్మ్-1 పరీక్షల షెడ్యూల్ వచ్చింది. ఇప్పటికే జిల్లా కేంద్రానికి ప్రశ్న పత్రాలు చేరుకున్నాయి. వాటిని డీఈఓ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ కార్యాలయాలకు తరలించాం. అక్కడి నుంచి పరీక్షకు గంట ముందు స్కూల్ కాంప్లెక్స్/పాఠశాలల హెచ్ఎంలు తీసుకెళ్తారు.

– గెడ్డాపు రాజేంద్రప్రసాద్, డీసీఈబీ సెక్రటరీ

పకడ్బందీగా నిర్వహణ..



పబ్లిక్ పరీక్షల మాదిరిగానే సెల్ఫ్ అసెస్‌మెంట్ టెర్మ్-1 (ఎస్ఏ 1) పరీక్షలను పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాలను విధిగా పాటించి తీరాలి. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని పరీక్షలను పారదర్శకంగా పూర్తిచేయాలి.

– డాక్టర్ సదాశివుని తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి

స్వయం ప్లస్‌పై సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన స్వయం ప్లస్ కార్యక్రమం, కోర్సుల నిర్వహణపై వర్చువల్ సమీక్ష మంగళవారం జరిగింది. కేంద్ర విద్యాశాఖ, మద్రాస్ ఐఐటీ నిర్వహించిన సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజిని హాజరయ్యారు. విద్యార్థుల ప్రవేశాలు, ప్రయోజనాలు, విద్యార్థులు నేర్చుకునే అంశాలపై సమీక్షించారు.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక



అభ్యర్థికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 44 మంది హాజరు కాగా 18 మందిని ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు, ప్రిన్సిపాల్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

వీఓఏ తొలగింపుపై నిరసన


ఆందోళన చేస్తున్న మహిళలు

పాతపట్నం:మండలంలోని ఆర్.ఎల్.పురంలో 20 సంవత్సరాలుగా వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న తనను రాజకీయ కక్షతో తప్పించారంటూ డోల భాగ్యవతి మంగళవారం పాతపట్నం వెలుగు కార్యాలయం వద్ద మహిళా సంఘ సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా భాగ్యవతి మాట్లాడుతూ ఏపీఎం ఇబ్బందులు పెట్టి తనను అకారణంగా విధుల నుంచి తొలగించారన్నారు. అన్ని సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు నా సేవలను గుర్తించి నాకు మద్దతు ఇవ్వడానికి ధర్నాలో పాల్గొన్నారని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

కంచిలి: ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్న పి.డి.ఎస్.బియ్యాన్ని జిల్లా విజిలెన్స్ అధికారులు దాడి చేసి మంగళవారం పట్టుకున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన ఈ బియ్యాన్ని పికప్ వాహనంలో ఒడిశాకు తరలిస్తుండగా ముందస్తుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు మకరాంపురం జంక్షన్ ఆదివారం సంత వద్ద నిఘా వేశారు. వాహనం రాగానే అడ్డుకుని అందులోని 60 సంచుల్లో ఉన్న 28.10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కేసు నమోదు చేశారు. బియ్యం రవాణా చేస్తున్న ఒడిశా వ్యాపారి రంగాల హరిశ్చంద్ర, డ్రైవర్ కొణతల విశ్వనాథంపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ బి.రామారావు, సి.ఎస్.డి.టి. పి.కూర్మారావు, ఆర్ఐ. కృష్ణప్రసాద్ రౌళో తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం విఫలం


తలగాం సమీపంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మండిపడ్డారు. మండలంలోని తలగాం సమీపంలో పంట పొలాల్లో వరి కోతలు, ధాన్యం కుప్పలను మంగళవారం పరిశీలించారు. అనంతరం దువ్వాడ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉండగా కేవలం ఐదు లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేస్తామని మంత్రులు, అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్లతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త స్కాంకు ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. తన సోదరుడు హరివరప్రసాద్ అడ్డాలో ఉన్న ఎఫ్‌సీఐ గొడౌన్‌కు అడ్డదారిలో సుమారు 3.30 లక్షల టన్నుల బియ్యం కట్టబెట్టడానికి ప్లాన్ వేసుకున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. బియ్యం నిల్వల విషయంలో ఏసీకేల పేరుతో కోట్లాది రూపాయలు దోపిడీకి ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికల మునుపు రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీమా పేరుతో రైతుల నుంచి కోట్ల రూపాయలు వసూళ్లు చేశారన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు అండగా ఉన్న ఆర్‌బీకేలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేసి వారికి నగదు చెల్లించాలని.. లేని పక్షంలో రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. వైస్ ఎంపీపీ పి.రమేష్, సర్పంచ్‌లు పి.లక్ష్మి, ఎస్.బాలకృష్ణ, నాయకులు వి.గోపాలకృష్ణ, ఆర్.ఆంజనేయులు, యు.విశ్వనాథం, ఎస్.మోహన్, సీహెచ్ చిన్నారావు ఉన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


స్వాతి (ఫైల్)

నరసన్నపేట: స్థానిక శ్రీదేవినగర్‌లో నివాసముంటున్న అంధవరపు స్వాతి (40) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వాతి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని భర్త మధుసూదనరావు చెబుతుండగా..తమ కుమార్తెను అల్లుడే హతమార్చాడని మృతురాలి తల్లిదండ్రులు అంటున్నారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం నరసన్నపేటలో తీవ్ర సంచలనం కలిగించింది. వివరాల్లోకి వెళ్తే.. మధుసూదనరావు, స్వాతి దంపతులు కొన్నాళ్లుగా శ్రీదేవినగర్‌లో నివాముంటున్నారు. వీరికి పదో తరగతి చదువుతున్న కుమార్తె ప్రణవి ఉన్నారు. మధుసూదనరావు నిమ్మాడ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి భార్య ఫ్యాన్‌కు వేలాడుతుండటాన్ని గమనించి పాలకొండలో ఉన్న అత్తామామలు మాణిక్యాలరావు, సుజాతలకు సమాచారం అందించారు. వారు వచ్చాకే మృతి సంగతి వెలుగులోకి వచ్చింది. కొద్దిరోజులుగా భార్యాభర్తలు ఘర్షణ పడుతున్నారని, అందులో భాగంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. మధుసూదనరావు తల్లి ఏడాది కిందట చనిపోయారు. శ్రీకాకుళంలో ఉంటున్న తండ్రిని ఇంటికి తీసుకొచ్చి ఉంచుదామని మధుసూదనరావు అంటుండగా, ఇందుకు భార్య వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. అయితే స్వాతి తల్లిదండ్రులు మాత్రం అల్లుడిపైనే తీవ్రంగా ఆరోపణలు చేస్తూ కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. ఈ మేరకు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాతి మృతిపై సమాచారం తెలుసుకున్న నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మత్తుతో జీవితం చిత్తు


సంకల్పం ర్యాలీలో పాల్గొన్న వర్సిటీ వీసీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సంకల్పం ర్యాలీ నిర్వహించారు. ముందుగా వీసీ కె.ఆర్.రజిని ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టాలి

- ప్రజలను మోసగించిన ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి: కృష్ణదాస్
- డబ్బులున్నవారికే పదవులిస్తున్న చంద్రబాబు: సీదిరి
- జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయమే శిరోధార్యం: కిల్లి వెంకట సత్యనారాయణ


వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణకు సన్మానం చేస్తున్న పార్టీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికి సంక్షేమాన్ని అందించిన గొప్ప నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కిల్లి వెంకట సత్యనారాయణ సన్మాన సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ దళారులకు అవకాశం లేకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పాలన అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేయడం, సూపర్‌సిక్స్ పేరుతో మోసం చేయడం వంటి కుటిల యత్నాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రతిఒక్కరూ ప్రశ్నించాలన్నారు.పార్టీకోసం కష్టపడి పనిచేసిన కిల్లి సత్యనారాయణకు రాష్ట్రస్థాయి పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ డబ్బులున్నోళ్లకే పదవులివ్వడం చంద్రబాబుకి అలవాటన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాజ్యసభకు బీసీలను పంపిస్తే చంద్రబాబు మాత్రం ఎవరి వద్ద ఎక్కువ అవినీతి డబ్బు ఉన్నాయో వారికే పదవులు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్షసాధింపులు, కోతలు, దౌర్జన్యాలు, రౌడీయిజం చేస్తూ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. వైఎస్సార్ సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాట్లాడుతూ తమ నియోజకవర్గానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపునిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, కళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, కళింగవైశ్యకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, అధిక సంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.